# 20 నుంచి ఓటర్ల జాబితా సవరణ

### ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల

హనుమకొండ, డిసెంబర్ 7 : ఓటరు జాబితా సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. వచ్చే సంవత్సరం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 20వ తేదీ నుంచి ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల చీఫ్ ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులై ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారు, వచ్చే జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండే వారికి ఓటు హక్కు కల్పించనున్నారు. అదే విధంగా ఇల్లు మారిన వారు, ఓటరు జాబితాలో పేర్లతో పాటు ఇతర వివరాలు తప్పుగా పడ్డవారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఈసీ సూచించింది. మరణించిన, చిరునామ మారిన వారి వివరాలను సేకరించేందుకు బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించింది.

### జాబితా సవరణ షెడ్యూల్..

ఈ నెల 20వ తేదీ నుంచి 2024 జనవరి 5వ తేదీ వరకు ఓటరు జాబితా సవరణ చేపట్టనున్నారు. ఇందులో మరణించిన వారికి నోటీసులు జారీ చేయడం, అలాగే వచ్చే జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన వారు, అర్హులై ఉండి ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోనివారు, జాబితాలో తప్పులు సరిచేసుకొనేందుకు వెసలుబాటు కల్పించారు. 2024 జనవరి 6వ తేదీన ఇంటిగ్రేటెడ్ ఓటరు జాబితాను పబ్లిష్ చేస్తారు. ఈ జాబితాపై జనవరి 6వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ క్రమంలోనో జాబితా సవరణకు సంబంధించి రెండో శనివారం, ఆదివారాల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు జాబితాను సరిచేసి 8వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

## పారా మెడికల్ సీట్ల భర్తీకి కేఎంసీ నోటిఫికేషన్

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 7 : పారా మెడికల్ కోర్సుల ప్రవేశాలకు కాకతీయ మెడికల్ కళాశాల నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు డిసెంబర్ 28, 29 తేదీల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విభాగాల వారీగా కేఎంసీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. 28వ తేదీన డిప్లొమా ఇన్ కార్డియాలజీ, డిప్లొమా ఇన్ డయాలసిస్, డీఏఎన్ఎస్, డీఎంఎస్‌టీ, డీవోఏ, డీఈపీటీ కోర్సులకు, 29న డీఎంసీటీ, డీఆర్ఈఎస్‌టీ, డీఈసీజీ, డీఆర్‌జీఏ, డీఎంఐటీ, డీడీఆర్ఏ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

## టెండర్ నోటిఫికేషన్ విడుదల..

కాకతీయ మెడికల్ కళాశాల వినియోగానికి అవసరమైన రసాయనాలు, కిట్లు తదితర వస్తువుల కొనుగోలుకు గురువారం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు టెండర్ దరఖాస్తులు ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, ఏదేని జాతీయ బ్యాంకులో కాకతీయ మెడికల్ కళాశాల హనుమకొండ జిల్లా పేరున రూ.వెయ్యి డిమాండ్ డ్రాఫ్ట్ (తిరిగి చెల్లించబడదు) చెల్లించాలన్నారు. టెండరు ధరావత్తుగా అదే పేరున రూ.10 వేల డిమాండ్ డ్రాఫ్టును జత చేయాలని తెలిపారు. టెండర్ దాఖలు చేయడానికి చివరి తేదీ ఈ నెల 28 అని అందులో పేర్కొన్నారు. 30న కేఎంసీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో టెండర్ తెరుస్తామని తెలిపారు.

## విద్యుదాఘాతంతో గొర్రె మృతి

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి మారం రమేశ్‌కు చెందిన గొర్రె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. రమేశ్ గొర్రెలను మేపేందుకు తోలుకెళ్లగా కమలాపూర్ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు షాక్‌తో గొర్రె మృతి చెందగా, మరో రెండు గొర్రెలకు గాయాలైనట్లు చెప్పారు. గొర్రె మృతితో నష్టపోయిన గొర్రెల కాపరిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## గ్రంథాలయ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది..

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 7 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా గ్రంథాలయ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో పాలక మండలి సభ్యులకు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న రేకులు, పెంకిటింట్లో ఉన్న గ్రంథాలయం నూతన హంగులతో నిర్మించి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించామన్నారు. మారిన రాజకీయ పరిణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, మండలి సభ్యులు పెద్ది సైదులు, నిమ్మల శ్రీనివాస్ ఉన్నారు.



గ్రావిటీ కెనాల్‌లో పడిన దుప్పికి వైద్యం చేస్తున్న వైద్యుడు

## గ్రావిటీ కెనాల్‌లో పడిన దుప్పి

కాళేశ్వరం, డిసెంబర్ 7 : కాళేశ్వరం ప్రాజెక్టులోని గ్రావిటీ కెనాల్‌లో గురువారం ఉదయం దుప్పి పడింది. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం బరాజ్‌కు నీరు తీసుకెళ్లే ఈ గ్రావిటీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు దుప్పి పడడంతో దానిని చూసిన ప్రయాణికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి రేంజర్ కమల తన సిబ్బందిని చేరుకుని, దుప్పిని బయటికి తీశారు. డాక్టర్ మల్లేశ్ దానికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అడవిలో వదిలి పెట్టారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు రాజీనామా



హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 7 : ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామా పత్రాన్ని ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్నాళ్లు తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హసన్‌పర్తి, డిసెంబర్ 7 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. సీఐ గోపి కథనం ప్రకారం.. మడిపల్లికి చెందిన మూగ వ్యక్తి ముంజ రాజేశ్ (29) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండేవాడు. అతడికి నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. మూడు సంవత్సరాల నుంచి భార్య కాపురానికి రాకపోవడంతో పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టించాడు. ఈ క్రమంలో భర్య కాపురానికి రావడం లేదని తన తల్లితో గొడవ పడి, జీవితంపై విరక్తి చెంది బుధవారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా, సాయంత్రం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మృతుడి కుటుంబానికి కడియం పరామర్శ

జఫర్‌గఢ్, డిసెంబర్ 7 : మండలంలోని తీగారం ఎంపీటీసీ గోనె సంధ్యారాణీరాజేశ్ దంపతుల కుమారుడు గోనె శివతేజ(9) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీగారం చేరుకుని శివతేజ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంధ్యారాణీ రాజేశ్ దంపతులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. శివతేజ మృతికి గల కారణాలు తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబీశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కరుణాక ర్‌రావు, సర్పంచ్ జయపాల్ రెడ్డి, జిల్లా నాయకులు రాజేశ్‌నాయక్, ఇల్లందుల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివతేజ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

### ఐదు బైక్‌ల సీజ్

హసన్‌పర్తి, డిసెంబర్ 7 : ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన జన్ను సంతోష్ బైకు రిపేరింగ్ ముసుగులో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసేవాడు. అతడిపై వరంగల్, నల్లగొండ, హైదరాబాద్‌లోని మూడు పోలీస్‌స్టేషన్‌లో 40కి పైగా కేసులు ఉన్నాయి. గురువారం ఉదయం బావుపేట క్రాస్ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి బైక్‌పై పారిపోయేందుకు ప్రయత్నించగా, సంతోష్‌ను పట్టుకొని విచారించారు. ఇప్పటివరకు ఐదు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఒక బైకు కాజీపేటలో, మరో బైక్‌ను హసన్‌పర్తిలో దొంగిలించినట్లు చెప్పాడు. బైక్‌లను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతి, మధు, నాగరాజును సీఐ అభినందించారు. ఎస్సై రాజు పాల్గొన్నారు.



బైక్ దొంగను అరెస్టు చూపుతున్న సీఐ తుమ్మ గోపి

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

చిట్యాల, డిసెంబర్ 7 : మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని అందుకుతండాలో చోటుచేసుకుంది. ఎస్సై జంగిలి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దామెరశెట్టి నరేశ్(23) ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ తరుచూ గ్రామంలో ప్రథమ చికిత్స తీసుకునేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3న సాయంత్రం కడుపు నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని సివిల్ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు అదే రోజు హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

లోన్స్



★SBI లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. ఎటువంటి సమస్యలున్న Solve చేసి అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్: 9493910808.
NTW-321475

REAL ESTATE

PLOT FOR SALE

★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు అతి తక్కువ ధరలో ప్లాట్లు. 2 లక్షలకే 121 చ||గజాల ప్లాట్, యాదాద్రి దగ్గర @ ఆలేరు. ఫెన్సింగ్, గేట్, సెక్యూరిటీ. Cont: 8008091512.
NT-313035

WANTED

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్దుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

CHANGE OF NAME

★I, RASHIDA BEGUM, W/o MOHAMMED SARDAR ALI have changed my name to MAHMMAD RASHIDA BEGUM R/o. H.No. 2-322, Hanuman Nagar, Bhupalpalle, Warangal-506169, T.S.
NTW-000

CHANGE OF NAME

★I, NASEER AHMAD MD, S/o. JALEEL AHMAD (Old Name), R/o. H.No. 19-11-288/1, Shanbhunipet, Khila Warangal. 506005, T.S., have Changed my name as MOHAMMED NASEER AHMED, S/o. MOHAMMED JALEEL AHMED (New Name).
NTW-13672

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA: 9182777563, 9182777618, 9182777213
WARANAGAL: 9182777556, 9182777557, 9182777558
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565